కథ

# గుండెలో ప్రతిమూర్తి

ఇబ్రహీం

"అబ్బా... ఈ హరిత ఇంకా రాదేం?" ఎంతసేపట్నుంచో మనసులో రేగుతున్న తహ తహ పెదాల గడియ తోసుకొని బైటకు రానే వొచ్చింది.

ఎంతదూరం పిట్టిగుంట? వడిగా అడుగులేస్తే ఇరవై నిమిషాలు. టైంకి బయల్దేరి వుంటే ఈ పాటికి ఎప్పుడో రావాల్సింది.


ఈరోజు కూడా రాదేమో... ఇంట్లో ఏమన్నా పనుందేమో...

వస్తూ దారి మధ్యలో కాని ఉందా? ఎంతదూరం వచ్చుంటుంది? సగిలేరు దాటి ఉండదూ?....

ఉండబట్టలేక ఆఫీస్‌రూమ్ లోంచి బైటికొచ్చా. చూపు అప్రయత్నంగా గేటు వైపు మళ్ళింది. తన రాకను తెలిపే సూచన ఏదీ గోచరమవలేదు.

చెవులు సుపరిచితమైన ఆ సైకిల్ బెల్ కోసం శోధించాయి.

గాల్లో ఏ గణగణలూ తేలి రాలేదు.



అలా గేటుదాకా వెళ్ళి రోడ్డు చివరికంటా చూద్దామా - అన్న కోరికను బలవంతంగా అణచుకొంటూ గ్రౌండ్‌లోకి నడిచాను.

వేసవి సెలవులు ముగిసి రెండు రోజులవుతోంది. క్లాసుల రొటీన్ మొదలవడానికి ఇంకో రెండు రోజులు పట్టేట్టుంది.

తరగతులన్నీ కోలాహలంగా ఉన్నాయ్. పిల్లల మొహాల్లో పొంగి పొరలుతూ కొత్త క్లాసుల ఆనందం, వాళ్ళ బ్యాగుల్లోంచి ఉబికుబికి వస్తూ కొత్త పుస్తకాల పరిమళం....

అటు తిరిగి ఇటు తిరిగి ఆఫీస్‌లోకే వచ్చి నిన్నటి పేపర్నే మళ్లొకసారి అందుకున్నా. పేపర్ కాస్త వణికినట్లనిపించింది. 'నలిపింది చాల్లేదా సామీ' అన్నట్లు దీనంగా చూసింది.

జిల్లా ఎడిషన్ నిండా అభినందనల వెల్లువ. చిన్నప్ప తడిసి ముద్దై పోయుంటాడేమో....

ఇలాంటి సాహితీమూర్తులు పుట్టినగడ్డకు వన్నె తెస్తారని పెద్దల పొగడ్తలు, రచయితల్లో చిన్నప్పది ప్రత్యేక గొంతు అని సాహిత్య విమర్శకులు, అలాంటి వాడు మా వాడు కావడం గర్వ కారణమని ఉపాధ్యాయ లోకం...

బాగా అసూయ కలిగింది. జారగిలబడి కళ్ళు మూసుకొని అతని స్థానంలో నన్ను ఊహించుకునే ప్రయత్నం చేశాను 'గ్లోబల్ తెలుగు అసోసియేషన్' నవలల పోటీలో నాకే లక్ష రూపాయల బహుమతి వచ్చినట్లు, రవీంద్రభారతిలో, కళాక్షేత్రంలో నాకే సన్మానాలు జరుగుతున్నట్టు, తోటి రచయితల్నుండి, అభిమానుల్నుండి అసంఖ్యాకంగా అభినందన సందేశాలు అందుతున్నట్లూ....

ఊహూఁ.... సాధ్యం కాలేదు.

అంతఇదిగా ఊహించడానిక్కూడా చేతగాకుండా ఉంది. అలాంటి గొప్ప రచయిత అవ్వాలంటే ఎన్నో అర్హతలుండాలనిపిస్తోంది.

ఎంతో కమిట్‌మెంట్, ఎంతో పరిశీలన, ఎంతో అధ్యయనం, ఎంతో సామాజిక స్పృహ, ఎంతో సృజనశీలత, మరెంతో గొప్ప హృదయం....

ప్చ్... వాటన్నిట్లోనూ నాదింకా విద్యార్థి దశే....

ఇలా ఇంకెన్నాళ్ళు సాహిత్యాభిమానిగా పాతు

కొని ఉండిపోవాలో... లోపల్నుంచి ఏదో ఆక్రోశం....

వీల్లేదు. పెంకుగట్టిన ఈ నిస్తేజాన్ని పగుల గొట్టుకొని పిల్లగానైనా బైట పడాలి. చిన్నదో చిత కదో ఏదో ఒక కథ రాసి యువ రచయితల జాబి తాలో అర్జంటుగా చేరిపోవాలి.

అందుకు నాకొక తోడ్పాటుకావాలి. ఒక మార్గ దర్శి దొరకాలి. కాసింత 'గురుత్వం' చేయూతనం దించాలి.

అదెవరో కాదు. చిన్నప్పే. తను నాకు గొంతెత్తి, పిలిస్తే పలికేంత దగ్గర్లోనే ఉన్నాడు.

ఎలాగోలా తన దగ్గర శిష్యరికం సంపాదిం చాలి. తనే నాతో కథాభ్యాసం చేయించాలి.

అందుకోసమే ఈ తపన.

ఈ రోజన్నా హరిత వస్తుందా?

సాయంకాలానికైనా చిన్నప్పను కలుస్తానా?

***

ఇంటికొచ్చేసరికి మాధవి డబుల్‌కాట్‌కు అడ్డం పడి సీరియల్లో మునిగిపోయి వుంది. నా అలికిడి తన్నే మాత్రం డిస్టర్బ్ చేసినట్లు లేదు.

తను నిజంగానే సీరియల్లో అంతగా లీనమవు తుందో.... నా రాకను గమనించి కూడా ఇగ్నోర్ చేస్తుందో...

రోజూ అనుభవానికొచ్చే విషయమే అయినా ఈ రోజెందుకో చిరాకు పుట్టుకొస్తోంది. అసహనంగా డైనింగ్ టేబుల్ వైపు నడిచాను.

గిన్నెల మీది మూతలు తీస్తోంటే, మొహమ్మీది కోపపు ముడత వొకటొకటే విడిపోసాగింది.

వెన్నెల మెతుకుల్లాంటి అన్నం, చింతచిగురుకు తోటకూర జతచేసి ఎనిపిన పప్పు, మల్లె రేకుల్లాంటి వడియాలు, ఘుమఘుమలాడే నెయ్యి, చిన్నప్ప కథల్లోని పల్లెటూరి రుచులు కొలువుదీరినట్లుండై.

భోజనం ముగించి మాధవివైపు కృతజ్ఞతగా చూశాను. తనింకా అలాగే పడుకోనుంది.

'అస్తమానం టీవీ యేనా?' ఈ మధ్య పేపర్లు చూడ్డం కూడా బొత్తిగా మానేసి నట్లున్నావే?''



దగ్గరి కెళ్ళి మృదువుగా ఆక్షేపించాను.

ఆఫ్ చేసి నా వైపు తిరిగింది. 'ఏంటి సంగతి?' అన్నట్లు చూసింది.

"చిన్నప్ప నవలకు మళ్ళీ బహుమతొచ్చింది కదా! పేపర్ నిండా అభినందనలే..."

" ఓ..... అలాగా..." ఆవలించి జుట్టు ముడివేసుకుంది.

తన ప్రతిస్పందన నీరసంగా అన్పించింది. సంభాషణ పొడిగించడానికి ఇబ్బంది కల్గించింది.

కాసేపటి తర్వాత "అప్పుడేదో 'గంగిరెద్దు'.... బహుమతి గెల్చుకున్నాడే, ఆయనేనా?" అడిగింది.

"ఆc... ఆయనే...." లటుక్కున అందుకున్నాను. కుర్చీ లాక్కొని ఎదురుగా కూర్చొని.

"ఎంతబాగా రాస్తాడో తెల్సా? నువ్వు గాని సహకరించావంటే, నేను కూడా ఆయన లాగా రాసి మంచిపేరు సంపాదించుకుంటా".

"తర్వాత?"

"తర్వాతేముంది?" ఏం చెప్పాలో తోచలేదు.

"మంచిపేరు. సంపాదించుకుంటా. అంతే..."

"అంతేలెండి. మీక్కావాల్సింది పేరే గదా!" మాటల్ని తుంచేసి వెళ్ళిపోయింది. తన గొంతులో ఏదో నిరసన...

"గంగిరెద్దులు, జానపదరూపాలు అని రాసి బహుమతులు సంపాదిస్తారు కానీ ఆ కళల కోసం నాలుక్కాసులు విదిలించరు. రైతులగోడును కథలుగా చెప్పి సొమ్ము చేసుకుంటారు గానీ ఆత్మహత్య చేసుకున్న ఏ రైతు కుటుంబాన్ని కాసింత ఓదార్చిన పాపాన పోరు. లోకంలో అందరూ చస్తుండాలి. ఆ చావుల్ని కళాత్మకంగా చిత్రించి మీరు రచయితలై వెలిగిపోవాలి." సీరియల్లో పాత్ర మాదిరి వంటింట్లోంచి దాడి మొదలు పెట్టింది.

అనవసరంగా మంటను రాజేసినట్టుండ. ఇంకాస్త తెలివిగా మాట్లాడి ఉండాల్సింది.

చిన్నప్ప గురించి గొప్పగా చెప్తే, నన్ను కూడా అటువంటి గొప్పను సాధించమని పురికొల్పుతుందనుకున్నా. వ్యవవహారం ఇలా బెడిసికొడుతుందను కోలేదు.

"ఐదు లక్షలు కట్నమివ్వందే పెళ్ళికి వొప్పుకోలేదు గానీ, ఈయన రచయితై లోకమ్మీద పడ్తాడంట!" పాత బాణమొకటి మరింత పదును పెట్టి వదిలింది.

"ఈ ప్రైవేటు బతుక్కు తోడు కథలు రాయడం వొకటి. గవర్నమెంటు ఉద్యోగం తెచ్చుకొని స్థిరపడండి ముందు. మళ్ళీ రాసుకుందురు కథలు, కాకరకాయలు..."

చెట్టును కొట్టాం. మీదేసుకోక తప్పుతుందా?

***

మధ్యాహ్నం బడికెళ్ళగానే తొమ్మిదో తరగతిలో విచారించాను. హరిత రాలేదు. తను రావటం, చిన్నప్ప దగ్గరికి నన్ను తీసుకెళ్ళి గ్రాండ్‌గా పరిచయం చెయ్యటం... ఇదంతా అవసరమా అన్పించింది.

నా గురించి తనకు ఎంతోకొంత తెలిసే ఉంటుంది. వెళ్ళి పరిచయం చేసుకొని, కంగ్రాట్స్ చెబితే సరి.... సగం పని అయిపోయినట్టే.

హెడ్మాస్టర్ నడిగి హాఫ్‌డే లీవ్ తీసుకొని గంగన్నపల్లె దారి పట్టాను. మిద్దెల దాటి కోనరాజుకుంట దగ్గరకొచ్చేసరికి పచ్చటి పరవశం మనసునిండా జొరబడింది.

తొలకరికే కడుపు నిండిపోయి ఎర్రనీటి తొలుకులతో తుళ్ళిపడుతోన్న కుంట, కుంటకింద విశాలంగా పరుచుకున్న రేగడి కొంగున ఆకుపచ్చ నక్షత్రాల కుట్టినట్లు పత్తిచేలు, కుంట మధ్య అక్కడక్కడా గొడుగులు పాతినట్లు నల్లతుమ్మ చెట్లు, వాటి సిగల్లో మల్లె మొగ్గల్లా వొదిగిన తెల్లకొంగలు... కట్టమీదుగా సాగుతుంటే కంటిపాపపై కదలాడుతున్న హరితవర్ణ దృశ్యాలు....

చిన్నప్ప కథల్లో ఇలాంటి పైరుపచ్చల సొగసులు కొల్లలు.

అతని కవితల్లో మట్టిలోంచి ఉబికే సువాసనలు, అతని కథల్లో మట్టి మనుషుల కళ్ళలో ఉబికే కన్నీటి వాసనలు....

పచ్చటి పల్లెల్ని పెనేసుకుంటున్న రాజకీయ విషనాగులు, చెమటతో 'తడి' గట్టిమట్టిని మెతుకుగా మారుస్తున్న శ్రమజీవుల వెతలు, పొలంలో కల్లంలో దన్నుగా నిలిచి రైతును రాజుచేసి తను మాత్రం బంటుగానే మిగులుతున్న దళితుల వ్యథలు, రక్తమాంసాలు పంచుకుపుట్టిన బిడ్డలు రిక్తహస్తాలై వెక్కిరిస్తుంటే క్షోభిస్తున్న వృద్ధాప్యపు గాథలు... వంచితుల పట్ల ఆయనకు అంతులేని ఆరాటం, వాళ్ళ తరపున ఆయనది 'అక్షర'మైన పోరాటం...

అంతగొప్ప వ్యక్తి, అంత సృజనాత్మకత, భావుకత ఉన్న కథకుడు ఉపాధ్యాయుడైతే ఆ బోధన ఎంత గొప్పగా ఉంటుందో?

దాన్ని కళ్ళారా చూడాలన్న కుతూహలం ఎక్కువైంది.

నా ప్రమేయం లేకుండానే అడుగుల వడి పెరిగింది.

నరసన్నపల్లె దాటి ఇవతలకొచ్చేసరికి అల్లంత దూరంలో బడి కనిపిస్తోంది. ఊరికి వెలుపల పెద్ద పెద్ద చెట్లతో వనాలను తలపిస్తున్న కల్లాలు.... కల్లాల వొడిలో వొదిగినట్లుగా బడి... గురుకులం లాంటి వాతావరణం...

అది మామూలు పాఠశాల అయ్యుంటుందా?

అది ఆటలతో అక్షరాలు నేర్పించే ఆటశాల, పాటలతో ప్రపంచాన్ని చూపించే పాటశాల, కథలతో లోకరీతిని తెలిపే కథాశాల, కవితలతో ఉర్రూతలూగించే కవనశాల...

అది నన్ను పిలుస్తున్నట్టే వుంది. 'రా రమ్మని' చేతులు చాపుతున్నట్టే వుంది.

కాసేపట్లో నాకెంతో ఆదర్శప్రాయుడైన వ్యక్తిని కలువబోతున్నాను. ఆయనతో ఎలా మాట్లాడాలి? ఏం మాట్లాడాలి?

అసలాయన రెస్పాన్స్ ఎలా ఉంటుందో?

గుండెల్లో దడ హెచ్చింది. నడక వేగం మందగించింది. తెలియని జంకేదో వెనక్కి లాగుతోంది.

ఉద్విగ్నతను అణుచుకుంటూ కాంపౌండ్ దగ్గరికొచ్చాను. గేటు మీద చెయ్యి వేయబోయి ఆగిపోయాను.

ఆయన ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతున్నాడు. శబ్దమైతే డిస్టర్బ్ అవుతాడేమో. అలాగే నిల్చుండిపోయాను.

సగానికి విరిచిన సజ్జ రొట్టెలా నుదురు, కాస్త లోపలికిపోయి తీక్షణమైన చూపుల్ని దాచుకున్న కళ్ళు, సన్నగా కొనదేలిన ముక్కు, పెదాల్ని దాచేస్తూ పెద్దగా మెలితిరిగిన మీసాలు, గుండ్రంగా ఉబ్బుగా బుగ్గలు, ముఖం నిండా పులిమినట్లు గాంభీర్యం... ఆ రూపం ఉపాధ్యాయుని క్కాస్త ఎడంగా, ఎవరో తాత్వికుల్ని స్ఫురణకు తెస్తోంది.


మాట్లాడ్డం ముగించి టేబుల్‌కు కాళ్ళూని వొళ్ళు విరుచుకుంటున్నాడు.

గేటు తీసుకుని లోపలికి అడుగు పెట్టాను.

అలికిడికి నావైపు చూస్తాడేమో అనుకుంటుండగానే మళ్ళీ ఫోన్మోగింది. సిగ్నల్ ప్రాబ్లమేమో, "హలో...." అనుకుంటూ అవతలి వైపు కిటికీ దగ్గరికెళ్ళాడు.

బయటే చూస్తుండిపోయాను.

బళ్ళో ఎక్కువమంది పిల్లలున్నట్టు లేరు. నలు



గురు ఓ మూల చేరి చీటీలాట ఆడుతున్నారు. వాళ్ళ తాలూకు పుస్తకాలు అక్కడక్కడ చిందర వందరగా పడున్నాయ్.

గోడలన్నీ బోసిపోయి ఉన్నాయి. బోధనోపకర ణాలు ఎక్కడా కనబడ్డం లేదు. రన్నింగ్ బ్లాక్‌బోర్డ్, లర్నింగ్, కార్నర్స్, వాల్‌మేగజైన్, స్కూల్‌పోస్ట్ బాక్స్... ప్రభుత్వ పాఠశాలల్లో ఉద్యమరీతిలో సాగుతున్న చదువుల వాతావరణం, ఆటా-పాటా ఏదీ కనబళ్ళేదు.

నేనూహించిన దానికి భిన్నంగా వుంది దృశ్యం.

ఆయనింకా సెల్లో మాట్లాడుతూనే ఉన్నాడు. చీటీలాడే పిల్లల్లో ఏదో పేచీ వచ్చింది.

పొట్టిగా నల్లగా ఉన్న పిల్లాడొకడు స్కోర్ రాస్తున్న వాని జుట్టు పట్టుకొని కలబడ్డాడు. వాడు బండబూతులు తిడుతూ తిరగబడ్డాడు. ఒకరినొ కరు తిట్టుకుంటూ కిందా మీదా పడుతున్నారు.

ఆయన వీళ్ళ దిక్కు ఒకసారి చూసి మళ్ళీ ఫోన్లో పడిపోయాడు.

కాంపౌండ్ దగ్గర కానుగచెట్టు మీద కాకులు రెండు కీచులాడుకుంటున్నాయ్. ఎర్రటి గోళ్ళు తెరచి ఒకదాన్నొకటి పొడుచుకుంటున్నాయ్.

ఎక్కణ్ణుంచో గోడమీదుగా రివ్వున దూసుకొ చ్చిన బంతి ఒకటి వాటిని చెదరగొట్టి చెరో దిక్కుకు ఎగురగొట్టింది. కాసేపటికి బంతి తాలూకు కుర్రాడు కూడా గోడదూకి లోపలి కొచ్చాడు. ఓ కంట బంతిని వెదుకుతూనే మరోకంట నా ఉనికిని ప్రశ్నిస్తున్నాడు.

కిటికీ దగ్గర సెల్ ఆగేటట్టు లేదు. ఎక్కడెక్కడి నుంచో దానికి పిలుపులు అందుతూనే ఉన్నాయ్.

అక్కడుండటం ఇబ్బందిగా అన్పించి బైటికి నడిచాను. అల్లంత దూరంలో ఎవరో గొర్లు మేపు కుంటున్నాడు. వెళ్ళి అతన్ని కదిలిస్తే కాసేపు టైంపాస్ అవుతుందేమో.

***

ఆకాశానికి మసిగుడ్డ కట్టినట్లు నలుపు కమ్మింది. ఎక్కడా చుక్క మిణుకుమిణుకు మనడం లేదు. చంద్రుణ్ణి ఏదో కరిమబ్బు మింగేసినట్టుంది. ఎక్కడో వర్షంలో తడిసొచ్చిన గాలి ఒంటిని చల్లగా తాకుతోంది.

రాగి గింజలు చల్లినట్లు సన్నగా చినుకులు మొదలైనై.

భోజనం చేసి పంచలో మంచమేసుకున్నాను. పుస్తకం తీసుకుంటే చదువబుద్ధి కాలేదు. మనసును ఆలోచనా చినుకులు పొడుస్తుండై.

గొర్రెల కాపరి మాటలు చెవుల్లో గింగురు మంటా వుండై.

“మా ఊరి టీచర్లు ఎప్పుడూ బడిచెప్పిన పాపాన పోలేదుసార్. ఈళ్ళను బదిలీ సేచ్చేగాని బడి బాగుపడ్డు”.

“ఇద్దరు టీచర్లుంటే ఒకాయన ఎప్పుడోగాని రాడు. వచ్చినా పొద్దు ఫోన్లో మాట్లాడ్డం తోనే సరి పోతది. ఇంగొకాయన పిల్లల్ని రేగ్గాయలకో, కలేపం డ్లకే తోలి పేపరు సదువు కుంటూ కూచ్చుంటాడు. ఈళ్ళను అదిలిచ్చేదానికి ఆఫీసర్లెవరూ లేరా సార్!” అన్నాడు.

జవాబేం ఇవ్వాలో తోచలేదు.

“అదేందయ్యా! మీ టీచరుకెంతో గొప్ప పేరుంది. మంచి కథలు రాస్తడు. పెద్ద పెద్ద బహు మతులు కూడా వచ్చినయ్” అన్నా.

“అట్టనా సార్! ఆయన కతలు రాచ్చుడా?! మరి మా పిల్లోల్ల ఖర్మేంది సార్, వాళ్ళ పేర్లు రాసుకోడం గూడా రాదు” ఆశ్చర్యమో వ్యంగ్యమో ముఖం నిండా పొలికించాడు.

“ఈడ అడిగేదిక్కు యాడుందిలే సార్! రొవ్వంత ఉన్నోల్లు, నోరు గలిగినోల్లు నరసా పురానికి ప్రైవేటు బడికి పంపిచ్చుకుంటాండరు. లేనోల్లు గొర్లకో, గొడ్లకో తోల్తాండరు” తనకు తానే సమా ధానం చెప్పుకున్నాడు.

“అద్దో.... ఆడ మానాకొడుకుతో పాటు ఇంగా నలుగురు బాల్ ఆట ఆడ్తుండరే... వాళ్ళు తప్పిచ్చి ఇంగెవరూ లేరు బళ్ళో...” బక్కచిక్కిన బడి రూపాన్ని కళ్ళకు కట్టించాడు.



## హన్సికకు అమ్మంటే హడల్...

‘కడివెడు గుమ్మడికాయ కత్తిపీటకు లోకువ’ అన్నట్లు... ఉంది హన్సిక పరిస్థితి. తాను ఎంత పెద్ద హీరోయిన్ అయినా హన్సిక తల్లికి తెగ భయపడుతుందట! ఇంటా, బయట కూడా తల్లి గీచిన గీత ఆమె దాటదట! హన్సిక ఎక్కడున్నా సరే రాత్రి పెందరాళే ఇంటికి రావాలన్నది తల్లి కండిషన్. ఇప్పటి వరకూ హన్సిక ఆ కండిషన్‌ను ఎప్పుడూ జవదాటలేదట! ఇటీవలే ఆ గీత దాటాల్సి వచ్చిందట! ఓ రోజు నైట్ పార్టీ నుంచి ఇంటికి వస్తుంటే మధ్యలో ట్రాఫిక్ జాంలో హన్సిక ఇరుక్కుపోయింది. సమయం గడుస్తున్న కొద్దీ ట్రాఫిక్ క్లియర్ కాకపోయేసరికి, హన్సికలో టెన్షన్ మొదలైంది. ఇక లాభం లేదనుకొని, కారుని అక్కడే వదిలేసి, చచ్చీ చెడీ నడుచుకుంటూ ఇంటికి చేరుకుందట! అప్పటికే తల్లి పెట్టిన గడువు సమయం దాటి గంటా గంటన్నర అయిపోయింది. తల్లి చేతిలో చివాట్లు తప్పవు అనుకుంటూ భయపడిన హన్సిక తిట్ల నుంచి తప్పించుకొందట! హన్సిక తల్లి కూడా ట్రాఫిక్‌లో ఇరుక్కుని కూతురితో పాటే ఇంట్లో అడుగుపెట్టిందట! అదీ సంగతి. లేకపోతే ఆరోజు తల్లి చేతిలో హన్సిక పని అయిపోయి ఉండేదట!

అతనిమాటల్లో ఎంతోకొంత నిజమున్నెట్టే వుంది. బడి వాతావరణం, చిన్నప్ప ఎడ తెగకుండా ఫోన్లో మాట్లాడ్డం... దాన్ని బలపరుస్తున్నట్టే వుండై.

అంతదూరం వెళ్ళి చిన్నప్పను కలవలేకపోతినే అనే నిరాశ, అతని విజయపు వెలుగుల వెనుక ఇలాంటి చీకటి దాగుందేనన్న ఆవేదనా... మన సును కలతపరుస్తున్నాయ్.

వర్షపు జోరు హెచ్చించి, తల్లో ఆలోచనల జడి లాగా. చాలా రోజుల క్రితం రేడియోలో విన్న చిన్నప్ప కథ జ్ఞాపకానికొస్తా వుంది.

ఊరికి కొత్తగా వచ్చిన టీచరు తన్ను కలవక పోవడం పట్ల సర్పంచు కినుక వహిస్తాడు. దాంతో టీచరు బడికే రావడం లేదని అధికార్లకు ఫిర్యాదు చేస్తాడు. ఎమ్మీవో సూచన మేరకు సర్పంచ్‌ని కలవ డానికి బయల్దేరుతాడు టీచరు. కానీ సర్పంచ్ దొర కడు. ఇంట్లోనే వుండి లేడని చెప్పిస్తూ ఉంటాడు. సర్పంచ్ ఇంటికి రోజూ తిరగడంలో టీచరుకు గ్రామస్తులు బాగా పరిచయమౌతారు. టీచర్ బాగా బడి కొస్తున్నాడని అతన్ని ఆదరించటం మొదలు పెడతారు. టీచరుకు సంతోషమౌతుంది. ‘రోజూ కళ్ళబడిన దానికే ఇలా ఆదరిస్తున్నారే... గ్రామంలోనే సంసారం ఉండి చదువు చెబితే ఇంకా ఎంత గౌరవిస్తారో కదా!’ అనుకుంటాడు. త్వరలోనే అతని నివాసం గ్రామానికి మారుతుంది.

ఇలాంటి కథ రాసిన వ్యక్తి చదువు చెప్పకుండా పిల్లలకు అన్యాయం చేస్తాడా? వాళ్ళ భవిష్యత్తును బలిపెట్టి తన సాహిత్య జీవితానికి మెట్లుగా మల చుకుంటాడా?

బహుశా చిన్నప్ప అంత దుర్మార్గుడు అయ్యుం డక పోవచ్చు.

టీచరెంత బాగా చెప్పిన చదువబ్బని వాడు ఎవడో ఒకడు ఉంటూనే ఉంటాడు. గ్రహణ - ధారణ శక్తులు తక్కువ అవడమో, ఏకాగ్రత లోపమో, బుద్ధి మాంద్యమో దానికి కారణం కావచ్చు. అటువంటి వాని తల్లిదండ్రులకు టీచరు మీద కోపముంటుంది. టీచరు సరిగా చెప్పకపో వటం వల్లనే తమ పిల్లాడికి చదువు రావటం లేదని అతని పని తీరు పట్ల అసంతృప్తి పెంచుకుంటారు. గొర్రెల కాపరి మాటలు కూడా అటువంటి అసంతృ

ప్తిలోంచి వచ్చినవేనేమో? అటువంటి మాటల ఆధారంగా ఒక గొప్ప రచయిత వ్యక్తిత్వాన్ని శంకించటం తప్పేమో....

అయితే, రచయితలంతా నిజంగా గొప్పవాళ్ళేనా? సాహిత్యంలో వ్యక్తంచేసే విలువలకు, నిజ జీవితంలో ఆచరించే విలువలకు వైరుధ్యం లేకుండానే వాళ్ళు జీవిస్తున్నారా?

వృత్తిరీత్యా ఉపాధ్యాయులుగా ఉంటున్న రచయితలు – రచనల ద్వారా మంచి సమాజాన్ని నిర్మిస్తూ, బోధన ద్వారా పిల్లల భవితను నిర్మిస్తూ – బాధ్యతలకాడిని రెండు భుజాల సమంగా మోయాల్సిన వాళ్ళు – అటువంటి వాళ్ళు కాడిని ఒకవైపు వదిలేస్తే .... వృత్తిని మరిచి ప్రవృత్తికే అంకితమైతే... జరిగేది నిర్మాణమా? ధ్వంసమా?

ఎంతోమంది రచయితలు, వాళ్ళలో దండిగానే ఉపాధ్యాయులు, వాళ్ళచేతుల్లో ఎందరో పేదపిల్లల బతుకులు, వాళ్ళంతా బోధన మానేసి రచనలకే పరిమితమైతే... ఆలోచించటానికే భయమేస్తోంది.

లేదు.. లేదు... వాళ్ళలా చెయ్యలేరు. వాళ్ళు ఉపాధ్యాయులు, పైగా రచయితలు. తమకింత తిండిపెడుతున్న వృత్తికి, వృత్తికి మూలమైన విద్యార్థులకు ద్రోహం చెయ్యలేరు. ఎవడో ఒకడూ అరా అలాంటివాడు ఉంటే ఉండవచ్చు. గాలికి చిక్కిన వర్షంలా మనసు కాసేపు అటూ కాసేపు ఇటూ కొట్టుకుంటూ వుంది.

లేచి, లైట్ వేసి పుస్తకం అందుకున్నాను. చిన్నప్ప కథలు నాలుగైదు గబగబా తిరగేశాను. వాటిలో నాకు నచ్చి అండర్‌లైన్ చేసిన భావాల్ని మళ్ళీ మళ్ళీ తడిమాను.

ఊహు.... వీల్లేదు. ఇలాంటి మాటలు చెప్పిన రచయిత చేతలు అలా ఉండటం సాధ్యం కాదు. ఒకసారి చూసినంత మాత్రాన, ఎవరో ఏదో చెప్పినంత మాత్రాన తొందర పడకూడదు. చిన్నప్ప గురించి పూర్తిగా తెలుసుకోవాలి.

ఉపాధ్యాయునిగా కూడా ఆయన గొప్పవాడే అయ్యుంటాడని మనసుకెందుకో బలంగా అన్పిస్తా వుంది.

***

''ఉత్త రచయిత అవడానికి ఇంత హైరానా అక్కరలేదండి'' టిఫిన్ వడ్డిస్తూ అంది మాధవి.

ఏం చెబుతుందో అర్థం కాలేదు. ప్రశ్నార్థకంగా చూశాను.

'' ఓ నలుగురి కథలు చదివి వాళ్ళు ఎలా రాస్తున్నారో గమనించి అలా కలం కదిలిస్తే చాలు. కదిలించగా కదిలించగా మీరు కూడా కథకుడై పోతారు'' ఓస్ ఇంతే కదా! అన్నట్టు చెప్పింది.

''అది సరే! ముందు 'ఉత్త రచయిత' అన్నావే – అదేంటి?'' అన్నా.

''అది కూడా తెలియదు పాపం!'' మూతి ముడిచి వెళ్ళిపోయింది.

ఏదీ సూటిగా చెప్పదు.

ఉత్త రచయితంటే లోకానికి నీతులుచెప్పి స్వయంగా ఆచరించనివాడని తన అభిప్రాయమేమో.

తన దృష్టిలో రచన, ఆచరణ వేరు వేరు కాదు. కళాకారుల గురించి, రైతుల గురించి, దళితుల గురించి రాయడమే కాదు. వాళ్ళ కష్టసుఖాల్లో మమేకమవ్వాలి. వాళ్ళ పక్షాన భౌతికంగా నిలబడి పోరాడగలగాలి.

నేనలా చెయ్యగలనా? అంతటి నిబద్ధత నాకుందా?

లేనప్పుడు నువ్వు రచయిత కావటం వృథా అంటుందేమో మాధవి.

టిఫిన్ ముగించి స్కూలుకు బయల్దేరాను.

రాత్రి వర్షం పరిసరాల్ని శుభ్రంగా కడిగి తళుకు నద్దింది. కానుగ ఆకులపై నిలిచిన చినుకు ముత్యాల్ని గమనిస్తూ ఆలోచనలో పడ్డాను, చిన్నప్ప దగ్గర శిష్యరికం చెయ్యడమా, వద్దా.... అని.

గేటు దగ్గర్నుండి హరిత వస్తోంది. తన్నుచూడగానే మనసు ఉప్పొంగింది. నాలుగడుగులు ముందుకేసి ఎదురెళ్ళా.

సైకిల్ నడిపించుకుంటూ వస్తోంది. వెనుక క్యారియర్ మీద బరువుగా పుస్తకాల బండిల్.

'' ఏంటి హరితా ఇవన్నీ?'' అన్నా.

''పుస్తకాలు సార్! మా నాయన పంపించాడు''.

ఒకటి నుండి ఐదు తరగతుల వాచకాలు.

మనసును కమ్ముకున్న అనుమానపు మేఘాలన్నీ చెల్లాచెదురై పోయినై. చిన్నప్ప ఎలాంటి వాడో తెల్సిపోయింది.

గంగిరెద్దుల వాళ్ళగురించి నవల రాయడమే కాదు. వాళ్ళ పిల్లల చదువుల కోసం పుస్తకాలు పంపించాడు.

''ఇచ్చివస్తాను సార్'' అంటూ హరిత బండిల్ మోసుకుంటూ ఆఫీస్‌లో కెళ్ళింది.

తను బైటికి రాగానే నేను లోపలికెళ్ళా. నా సంతోషాన్ని హెడ్‌మాస్టర్‌తో పంచు కోవాలనిపించింది.

''నిజంగా చిన్నప్ప గ్రేట్ సార్!'' అన్నా.

కాస్త అయోమయంగా చూశాడు.

''మన స్కూల్లో పేదపిల్లలకు పంచడానికి పుస్తకాలు పంపించాడు. చాలా మంచిపని కదా!'' అన్నా.

అయోమయం విడిపోయి పెద్దగా ఆఫీస్ అంతా అదిరిపోయేలా నవ్వాడు హెడ్మాస్టర్.

''పంచడానికి కాదు స్వామీ... అమ్మడానికి. వీటి ధరను కూతురి ఫీజులో బిగబట్టు కుంటాడు''.

''ఆయనకు కథలు రాసుకోవడం తోనే సరిపోతది. చదువు చెప్పేది లేదు. పాడూ లేదు. చెప్పని దానికి పుస్తకాలివ్వడమెందుకుని వాటిని కూడా అమ్ముకుంటాడు'' మళ్ళొకసారి బిగ్గరగా నవ్వాడు.

హెడ్‌మాస్టర్ మాటలు చెవుల్లో తుపాకీ తూటాల్లా దిగబడ్డాయి.

గుండె గదిలో ప్రతిష్ఠించుకున్న మూర్తి ఒకటి దగ్ధమై పోసాగింది.

ఆ జ్వలనంలో తన దగ్గర శిష్యరికం చెయ్యాలన్న కోరిక కూడా తగలబడి పోతోంది.

ఉత్తమ కథకుడినవ్వాలన్న కల సైతం కాలిపోతోంది.

ఉత్తమ ఉపాధ్యాయునిగా మిగిలిపోతే చాలనిపిస్తోంది.

*

రచయిత సెల్ నెం: 9550113040

కవిత


# కోకిలమ్మ పదాలు




సమతకోసం ఆర్తి
యుతవకోరే స్ఫూర్తి
నవత శ్రీశ్రీ దీప్తి
ఓ కోకిలమ్మా!



రణభేరి మ్రోగించి
రగిలె ప్రజల గురించి
రెండు శ్రీల విరించి
ఓ కోకిలమ్మా!



వికృతుల దునుమాడు
వేమన్న మొనగాడు
శ్రీశ్రీకి జతగాడు
ఓ కోకిలమ్మా!



పీడకుల ప్రతికక్షి
పీడిత నిటాలాక్షి
శ్రీశ్రీ మనస్సాక్షి
ఓ కోకిలమ్మా!

శబ్దార్థముల మేటి
శరపరంపర ధాటి
లేరు శ్రీశ్రీ సాటి
ఓ కోకిలమ్మా!



విప్లవం తన ఆశ
విప్లవం తన ధ్యాస
అదే శ్రీశ్రీ శ్వాస
ఓ కోకిలమ్మా!

ప్రజల పోరుకు దన్ను
ప్రతిన పూనిన గన్ను
నిజం శ్రీశ్రీ పెన్ను
ఓ కోకిలమ్మా!



మార్క్సిస్టు విజిగీష
మార్పుకై రణఘోష
గెలుపు శ్రీశ్రీ భాష
ఓ కోకిలమ్మా!

–అదృష్టదీపక్